నాడు నిధుల మంజూరు.. నేడు పనులు

- పోలంరాజుగుంట రోడ్డు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు
- నిధులు మంజూరు చేయించిన కాకాణి
- ఆరు గ్రామాల ప్రజలకు ఉపయోగం

ఎన్ని కిలోమీటర్లు : **10**

మంజూరైన నిధులు : రూ.**6.59** కోట్లు

ముత్తుకూరు: పల్లెల్లో రోడ్ల అభివృద్ధి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. నాడు మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడి గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.

ముత్తుకూరు – వెంకటాచలం మండలంలోని ఆరు గ్రామాల ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం నుంచి దర్భలమిట్ట వరకు, ముత్తుకూరు మండలంలోని అలగల దళితవాడ నుంచి పోలంరాజుగుంట, పోతునాయుడుదిబ్బ, నారికేళపల్లి, సుబ్బారెడ్డిపాళెం వరకు రోడ్డు గతంలో అధ్వానంగా ఉండేది. గుంతలమయమైన ఈ రహదారిపై ప్రయాణం చేయలేక ప్రజలు కష్టాలు పడేవారు. ఈ పరిస్థితిని చూసిన నాటి మంత్రి కాకాణి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి బీటీ రోడ్డు మంజూరు చేయించారు. ఆయన కృషి ఫలితంగా పీఎంజీఎస్‌వై–3 కింద రూ.6.59 కోట్లు వచ్చాయి. సుమారు 10 కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణ పనులు నేడు పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్నాయి.


మొదలైన పోతునాయుడుదిబ్బ - నారికేళపల్లి రోడ్డు


మొదలైన అలగల దళితవాడ రోడ్డు


నాడు గుంతలమయంగా నారికేళపల్లి రోడ్డు

నిరీక్షణ ఫలించింది


గుంతలమయమైన నారికేళపల్లి రోడ్డు ఎట్టకేలకు బాగుపడుతోంది. ప్రజల నిరీక్షణ ఫలించింది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషి ఫలితంగా నిధులు మంజూరు కావడం, పనులు జరగడం సంతోషంగా ఉంది.

– బల్లెం వెంకటరమణయ్య, మాజీ సర్పంచ్, నారికేళపల్లి

కాకాణికి కృతజ్ఞతలు


ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పోలంరాజుగుంట, అలగల దళితవాడ రోడ్లకు మోక్షం లభించింది. దీనికి నాడు కృషి చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఈ పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది.

– దువ్వూరు కోదండరామరెడ్డి, పోలంరాజుగుంట

అన్ని గ్రామాలకు అనుకూలం


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.6.59 కోట్ల నిధులు రోడ్డు పనులకు మంజూరయ్యాయి. ఇవి పూర్తయితే ఆరు గ్రామాలకుపైగా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. నాటి మంత్రి కాకాణి ఈ రోడ్డుకు నిధులు సాధించడం కోసం ఎంతో కృషి చేశారు. వారికి అభినందనలు.

– సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, పోతునాయుడుదిబ్బ

ధరలు లభించకపోవడం వాస్తవమే..

- అంగీకరించిన వ్యవసాయ శాఖ

పొదలకూరు: జిల్లాలో రైతులు నిల్వ చేసుకున్న ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తున్నా వారు ఆశించిన స్థాయిలో లేకపోవడం వాస్తవమేనని వ్యవసాయ శాఖ అధికారులు అంగీకరించారు. మంగళవారం సాక్షిలో 'ధాన్యం రైతు దైన్యం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ అధికారులు పొదలకూరు ఏఓ వాసు ద్వారా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఎడగారు వరి ధాన్యం దిగుబడి అవుతున్న తరుణంలో నిల్వ చేసుకున్న పాత ధాన్యానికి రూ.26 వేల వరకు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం


పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప నాయుడు స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం ప్రారంభయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శతాధిక ప్రతిష్టాపనాచార్యులు బ్రహ్మశ్రీ గాడేపల్లి ప్రశాంత్‌శర్మ వివిధ పూజా కార్యక్రమాలు చేశారు. బుధవారం వివిధ పూజల అనంతరం మధ్యాహ్నం స్వామి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గూడూరుకు చెందిన రోటరీ క్లబ్ మంగళవారం కంప్యూటర్, ఇతర సామగ్రిని వితరణగా ఇచ్చింది. స్కూల్లో కంప్యూటర్ లేదనే విషయాన్ని తెలుసుకున్న క్లబ్ నిర్వాహకులు దానిని, ప్రింటర్, పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బండి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి జీజీ నాయుడు, జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, స్పాన్సర్ కిరణ్ చక్రవర్తి, సీనియర్ రోటేరియన్ దశరథరామిరెడ్డి, రొటేరియన్స్ బలరామిరెడ్డి, రవీంద్రారెడ్డి, హెచ్‌ఎం వసంతకుమారి, కో–ఆప్షన్ సభ్యులు వీరప్రతాప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


హరియ్య (ఫైల్)

విడవలూరు: మండలంలోని వడ్డిపాళేనికి చెందిన బెల్లంకొండ హరియ్య (55) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబసభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను మనసేవ సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్ వారికి దానం చేశారు. టెక్నీషియన్ వేణు నేత్రాలను సేకరించారు.

శివపార్వతులకు పల్లకిసేవ


మనుబోలు: మండల కేంద్రంలో ఉన్న బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి శివపార్వతులకు పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా దేవాంగుల సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు ఫణీంద్రశర్మ చాముండేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి ఊరేగింపు చేశారు.

బుచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సురేంద్రబాబు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సురేంద్రబాబు మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2007 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఎస్సై. చిన్నబజారు పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేస్తూ బదిలీపై బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. దీని పరిధిలో కొడవలూరు, విడవలూరు మండలాలున్నాయి.

బీజేపీ నాయకుడి మృతికి సంతాపం

ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామానికి చెందిన బీజేపీ మైనారిటీ నాయకుడు షేక్ రెహమాన్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ఈయన మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గసభ్యుడిగా పనిచేశారు. రెహమాన్ మృతికి నాయకులు సంతాపం తెలిపారు.

రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమణబాబు అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని నగర పంచాయతీ పరిధిలోని చెన్నూరు రోడ్డు వద్ద వ్యాపారులతో మాట్లాడారు. రోడ్డు పక్కన కూరగాయలు విక్రయించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అంతేకాకుండా నిబంధనలు పాటించి మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతున్న వారు నష్టపోతున్నారని తెలిపారు. వ్యాపారులు వారికి కేటాయించిన స్థలంలో వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

కోవూరు: ముస్లిం, మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సంరక్షణ కోసం ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రషీద్ తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆవాజ్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించేందుకు పూనుకోవడం దారుణమన్నారు. మోదీ ప్రభుత్వం ముస్లింల అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు చట్టాన్ని కాపాడుకోడానికి ఈనెల 27న నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- ఉద్యోగులు, ప్రజల అవస్థలు

తోటపల్లిగూడూరు: మండలానికి సంబంధించి ఎంతో కీలకమైన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీనిని సుమారు 70 సంవత్సరాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. గతంలో ఈ భవనంలో అటు మండల పరిషత్, ఇటు రెవెన్యూ విభాగాల కార్యకలాపాలు కొనసాగేవి. అయితే పదిహేనేళ్ల క్రితం మండల పరిషత్ కార్యాయం నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం మాత్రం పాత భవనంలోనే కొనసాగుతూ వస్తోంది. శిథిలావస్థకు చేరిన ఇది చినుకు పడితే చిత్తడిగా మారిపోతుంది. గోడలు దెబ్బతిని పడిపోయేలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో విధులు నిర్వహించేందుకు అధికారులు భయపడిపోతున్నారు. అలాగే ఈ భవనంలో సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నూతన నిర్మాణానికి సంబంధించి ఇరవైఏళ్లగా అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.


తోటపల్లిగూడూరు తహసీల్దార్ కార్యాలయం

డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించాలంటూ..


ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మనుబోలు: డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించాలని, కోల్‌కతాలో పీజీ ట్రెయినీ డాక్టర్‌పై హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మనుబోలులో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు మొహిసినా సుల్తానా, గేయ పూజిత మాట్లాడుతూ కోల్‌కతా ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలపై దాడులను ఖండిస్తున్నామన్నారు.

నీరు రాక.. జనం కష్టాలపాలు



నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

విడవలూరు: మండలంలోని ముదివర్తి గ్రామం దళితవాడలో వారంరోజుల నుంచి నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కుళాయిల్లో నీరు రాకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో వంట చేసేందుకు డబ్బులిచ్చి నీటిని కొనుగోలు చేస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అది కూడా దూర ప్రాంతాల నుంచి ఎద్దుల బండిలో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యపై సర్పంచ్, సచివాలయ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం తమ ప్రాంతానికి వచ్చి నీరెందుకు రావడం లేదో కూడా తెలుసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి కష్టాలు తీర్చాలని మంగళవారం వారు కోరారు.

పట్టించుకోవడం లేదు


నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్, సచివాలయ కార్యదర్శి దృష్టికి తీసు కెళ్లాం. అయినా మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు.

– సిరివెన్నెల

నడిచి వెళ్లి తెచ్చుకోలేకున్నాం


నేను, నా భర్త వృద్ధులం. నడిచి వెళ్లి నీరు తెచ్చుకోలేకున్నాం. చాలా బాధగా ఉంది. స్పృహ తప్పి పడిపోయేలా ఉన్నాం.

– దేవతాటి కోటేశ్వరమ్మ

ఇబ్బంది పడుతున్నాం


పిల్లలకు స్నానం చేయించి బడికి పంపాల్సి ఉంది. అయితే నీరు రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. రోజూ స్నానానికి వేరే ఇళ్లకు పిల్లల్ని తీసుకెళ్లాల్సి వస్తోంది. మా సమస్యను పరిష్కరించండి.

– బండెల స్పందన

మూగజీవాలు అల్లాడిపోతున్నాయి


ఈ ఎండలకు గేదెలు, గొర్రెలు నీరు లేక మూగజీవాలు అల్లాడి పోతున్నాయి. వాటి దాహార్తిని తీర్చండి.

– ఎల్ల పద్మమ్మ

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

పొదలకూరు: ప్రజలకు పరిసరాలను పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిచ్చి దోమలను పారద్రోలాలని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్ట్ 20వ తేదీన మలేరియా దోమల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి ఇళ్లలో పాత్రలను శుభ్రం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ రిషిత, సూపర్‌వైజర్ కె.శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, ఆరోగ్య సహాయకులు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


కొడవలూరు: యల్లాయపాళెంలో ర్యాలీ

⇨ **కొడవలూరు:** మండల కేంద్రమైన కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.బాలచంద్రబాబు మాట్లాడుతూ దోమల కారణంగా అనేక ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. రాత్రిళ్లు దోమతెరలను విధిగా వాడాలని సూచించారు కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, హెచ్‌ఎస్‌వీ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

⇨ యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు జనార్దన్, కావ్య మాట్లాడుతూ దోమల కారణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్‌లు రజియా, సురేంద్ర, ఏఎన్‌ఎంలు సుకన్య, మహేశ్వరి, శాంతకుమారి, అనిత, మమత, కీర్తి పాల్గొన్నారు.

⇨ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ సయ్యద్ అహ్మద్‌బాబు మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అంతకుముందు ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై పీహెచ్‌సీలో శిక్షణ ఇచ్చారు.


పొదలకూరు: రోనాల్డ్ రాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


జొన్నవాడ పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ

అధ్వానంగా గొల్లపాళెం రోడ్డు

తోటపల్లిగూడూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండపం పంచాయతీ గొల్లపాళెం ప్రధాన రహదారి దారుణంగా ఉంది. చంద్రశేఖరపురం నుంచి గొల్లపాళెం వరకు 600 మీటర్ల మేర ఉన్న ఈ బీటీ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పంచాయతీ ప్రతినిధులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.




హంస వాహనంపై వెంకయ్యస్వామి

మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హంస వాహనసేవ నేత్రపర్వంగా సాగింది.

– వెంకటాచలం

నేటి నుంచి నెల్లూరు - పంటపాళెం బస్సు

నెల్లూరు సిటీ: వీఆర్సీ సెంటర్ నుంచి పంటపాళెం వరకు ఆర్టీసీ బస్సును బుధవారం నుంచి నడపనున్నామని నెల్లూరు రెండో డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ సెంటర్ నుంచి నారాయణ మెడికల్ కళాశాల, కాకుపల్లి, బ్రహ్మదేవీ, బండ్లపాళెం, దువ్వూరువారిపాళెం, పోలంరాజుగుంట మీదుగా పంటపాళెం వరకు బస్సును నడపనున్నామని చెప్పారు. వీఆర్సీ సెంటర్ నుంచి ఉదయం ఎనిమిది.. మధ్యాహ్నం 12.45, సాయంత్రం నాలుగు గంటలకు.. పంటపాళెం నుంచి ఉదయం 7.30, మధ్యాహ్నం 2.30, సాయంత్రం 5.30కు బయల్దేరనుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రిసభ్య కమిటీ ఏర్పాటు

నెల్లూరు(టౌన్): నగరంలోని కేఎన్నార్ స్కూల్లో సన్‌షేడ్ కూలి విద్యార్థి గురుమహేంద్ర మృతిచెందిన ఘటనపై జిల్లా అధికారులు ఎట్టకేలకు స్పందించారు. పాఠశాలలో జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించేందుకు గానూ త్రిసభ్య కమిటీని కలెక్టర్ ఆనంద్ నియమించారు. ఇందులో డీఈఓ, అడిషనల్ కమిషనర్, సమగ్రశిక్ష ఇంజినీరింగ్ అధికారిని సభ్యులుగా ఏర్పాటు చేశారు.